
సాక్షి ప్రకాశం

ఆదివారం । 2 । మార్చి । 2025



ఉపవాసం..పుణ్యఫలం

ముస్లింల పవిత్ర మాసం రంజాన్ నెల ప్రారంభమైంది. ఆదివారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమవుతున్నట్లు మత పెద్దలు ప్రకటించారు.

- 8లో..



విద్యుదాఘాతంతో ఒకరు మృతి

విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందిన ఘటన కనిగిరి మండలంలోని పునుగోడులో శనివారం జరిగింది.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33/24

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

మహిళలందరూ ఆర్థిక స్వావలంబన సాధించాలి

- కలెక్టర్ తమీమ్‌అన్సారియా



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: మహిళలందరూ ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం ప్రారంభమైన అవగాహన ర్యాలీ రిమ్స్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీని కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు మహిళలు, హక్కుల సాధికారతపై అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం పలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ ర్యాలీలో పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, డీసీపీఓ దినేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రజకులంటే కక్ష ఎందుకు చంద్రబాబు ?

ఒంగోలు టౌన్: జీవో నెంబర్ 24 ద్వారా లాండ్రీలకు ఇచ్చే 150 యూనిట్ల ఉచిత విద్యుత్, 75 జీవో ద్వారా దోభీఘాట్లకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం కూటమి ప్రభుత్వం రజకుల పట్ల వివక్ష చూపుతుందనడానికి నిదర్శనమని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరాం శనివారం ఒక ప్రకటనలో చెప్పారు. ఈ రెండు జీవోలను బడ్జెట్లో తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రజకులంటే ఎందుకు కక్షో తెలపాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు తెలుగు దేశం ప్రభుత్వం రజకులకు ఇచ్చిన ఒక్కటంటే ఒక్క హామీని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మీద ఆర్థిక భారం పడని హామీలను నెరవేర్చే అవకాశం ఉన్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం రజకులకు మేలు చేసేందుకు సిద్ధంగా లేదన్నారు. ఈనామ్ భూములు అన్యాక్రాంతంపై కూటమి పాలకులు మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. జగనన్న టౌన్‌షిప్పుల్లో సేకరించిన కమ్యూనిటీ స్థలాల్లో రజకుల వృత్తి అవసరాలకు ప్రత్యేక స్థలాలను కేటాయిస్తే ప్రభుత్వం పై పడే ఆర్థిక భారం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంతో రజకులు ఆగ్రహంగా ఉన్నారని అన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

మార్కాపురం టౌన్: బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపడాన్ని నిరశిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మార్కాపురం పట్టణంలోని కోర్టు సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం నాయకులు అందె నాసరయ్య, రఫీ, సోమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వెలుగొండకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరినా కేవలం రూ.359 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. వెలుగొండ ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం నశించాలన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారు. ఏ మాత్రం ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నా రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, మొదటి టన్నెల్ ద్వారా ఈ ఏడాది వరద సీజన్‌కు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయా పార్టీల నాయకులు జి.బాలనాగయ్య, ఎస్కే ఖాశీం, జవ్వాజి రాజు, రూబెన్, నన్నేసా, సురేష్ కుమార్, కాశయ్య, చిత్తారి పెద్దన్న, అల్లూరయ్య పాల్గొన్నారు.

మృత్యు వలలో!

సాగరతీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల మరణ మృదంగం



తీరంలో చనిపోయిన తాబేళ్ల కళేబరాలు

సాగర తీరం అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యు తీరమవుతోంది. చేప గుడ్లను మింగేసే జెల్లీఫిష్‌ను, నాచును తినడం ద్వారా మత్స్యసంపదను కాపాడుతున్న వీటికి ప్రాణగండం ఏర్పడింది. సముద్రగర్భంలో ఉండే ఇవి గుడ్లు పెట్టేందుకు తీరానికి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. తమిళనాడుకు చెందిన మెకనైజ్డ్ బోట్లు తీరం సమీపానికొచ్చి వేటసాగించడం, భారీ వలలు, కాలుష్యం తదితర కారణాలతో నేడు అవి జీవన్మరణ పోరాటం సాగిస్తున్నాయి.

- ఉమ్మడి ప్రకాశంలో సుమారు 600 వరకూ మృత్యువాత
- తీరంలో భారీగా తాబేళ్ల కళేబరాలు
- తమిళనాడు సోనాబోట్లు, భారీ వలలు, కాలుష్యం కారణం
- సంరక్షణకు నామమాత్రపు చర్యలు

సింగరాయకొండ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రామాయపట్నం నుంచి చీరాల వరకూ విస్తరించి ఉన్న సముద్రతీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు దర్శనమిస్తుండడంపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా నవంబరు నుంచి మార్చి నెల మధ్యలో ఇవి సంతానోత్పత్తి కోసం థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేషియా తదితర దేశాల నుంచి సుమారు 20 వేల కిలోమీటర్లు ప్రయాణించి ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని సముద్రతీరాలను చేరుకుని గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసిన తరువాత తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లిపోతాయి. ఈ ప్రాంతాలకు వచ్చిన అవి గుడ్లు పెట్టే సమయంలో తీరానికి వస్తాయి. ఒక్కో తాబేలు గుడ్లు పిల్ల దశకు రావడానికి సుమారు 60 రోజులు పడుతుంది. ఈ ప్రక్రియ కోసం వచ్చిన తాబేళ్లు మృత్యువాత పడడం విచారకరం.

ఉమ్మడి జిల్లాలో 600 వరకూ మృతి

నవంబర్ నుంచి ఫిబ్రవరి మాసం వరకు ఉమ్మడి ప్రకాశం తీరంలో 500 నుంచి 600 వరకూ మృతి చెంది ఉంటాయని చెన్నైకు చెందిన 'ట్రీ ఫౌండేషన్ సంస్థ' చెబుతోంది. ఈ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న తీర ప్రాంతాల్లో మెరైన్, మత్స్యశాఖ, పోలీస్‌శాఖకు చెందిన వారితో కలసి ఈ సంస్థ సర్వే నిర్వహించింది. ఉమ్మడి జిల్లాలోని తీరం వెంబడి వందల సంఖ్యలో ఇవి చనిపోయాయని గుర్తించింది. తాబేళ్లు సముద్రపు అడుగున ఉంటున్నప్పటికీ ప్రతీ 45 నిమిషాలకు ఒకసారి నీటిపైకి వచ్చి గాలి పీల్చుకొని మళ్లీ వెళ్లిపోతాయి. అలాగే గుడ్లు పెట్టే సమయంలోనూ తీరానికి వస్తుంటాయి. ఇదే వీటి పాలిట శాపంగా మారింది.

ఎక్కడ చూసినా తాబేళ్ల కళేబరాలే..



సముద్రతీరంలో ఇటీవల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తాబేళ్లు చనిపోయి తీరానికి చేరుతున్నాయి. ఇటీవల కాలంలో కడలూరు బోట్లు తీరంలో వేటాడటంతో ఆ బోట్ల భారీ వలల్లో తాబేళ్లు చిక్కుకుని మృతిచెందుతున్నాయి. గతంలో కేవలం సుమారు 15 వరకు తాబేళ్లు తీరంలో మృతి చెందితే ఈ సంవత్సరం మాత్రం తీరంలో ఎక్కడ చూసినా తాబేళ్ల కళేబరాలే కనబడుతున్నాయి.

– వాయిల రాముడు, మత్స్యకారుడు, పాకల

మృత్యుపాశాలుగా సోనాబోట్లు

తమిళనాడు రాష్ట్రం కడలూరు ప్రాంతానికి చెందిన సోనాబోట్లు తాబేళ్ల పాలిట మృత్యువు పాశాలుగా మారాయి. సోనాబోట్లు తీరానికి దూరంగా 12 నాటికల్ మైళ్లకు అవతల చేపలు వేటాడాలి. అయితే తీరానికి 40 మీటర్ల దూరంలోనే చేపల వేట సాగిస్తున్నాయి. దీంతో గుడ్లు పెట్టడానికి తీరానికి చేరుకునే ప్రయత్నంలో తాబేళ్లు సోనాబోట్ల వలలకు చిక్కి మరణిస్తున్నాయి. ఒక్కసారి సోనాబోట్ల వలలో చిక్కుకుంటే చాలు మృత్యువాత పడినట్లేనని స్థానిక మత్స్యకారులు అంటున్నారు. కొద్ది నెలలుగా ప్రతిరోజు రాత్రి పగలు తేడా లేకుండా తీరంలో వేటాడటంతో అటు మత్స్య సంపద పోవటంతో పాటు తాబేళ్లు కూడా మృత్యువాత పడి కళేబరాలు తీరానికి చేరుకుంటున్నాయి. చేపగుడ్లను తినే జెల్లీ ఫిష్‌ను ఇవి ఆహారంగా తీసుకోవటంతో మత్స్యసంపద వృద్ధి చెందుతుంది. అదే విధంగా సముద్రపు నాచును కూడా ఇవి ఆహారంగా తీసుకోవడంతో చేపలు గుడ్లు పెట్టేందుకు అనువుగా ఉంటుంది. తాబేళ్లు అంతరించిపోతే మత్స్యసంపదకే ప్రమాదమని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు.



పాకల తీరంలో చేపల వేట సాగిస్తున్న సోనాబోట్లు (ఫైల్)

సోనాబోట్ల వలలకు చిక్కుకుని తాబేళ్లు చనిపోతున్నాయి



ఇటీవల కాలంలో తీరానికి తాబేళ్ల కళేబరాలు భారీగా వస్తున్నాయి. సోనాబోట్లు తీరానికి దగ్గరగా వేటాడటంతో వలలో చిక్కుకుని తాబేళ్లు చనిపోతున్నాయి. గతంలో ఎన్నడూ ఈ విధంగా తాబేళ్లు చనిపోలేదు. సోనాబోట్లను తీరం దగ్గరికి రాకుండా కట్టడి చేయాలి.

– కఠారి నరశింహం, మత్స్యకార కాపు, పాకల

తీరంలో రొయ్యల చెరువుల కాలుష్యం కూడా

సముద్ర తీరంలో అనధికారికంగా రొయ్యల సాగు జోరుగా సాగుతోంది. వీరు రొయ్యల సాగుకు సముద్రపు నీటిని ఉపయోగించి మళ్లీ సాగు పూర్తయిన తరువాత కెమికల్ నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు. దీంతో తీరానికి వచ్చిన తాబేళ్లు ఈ కలుషిత నీటి కారణంగా మృత్యువాత పడుతున్నాయి.



తీరంలో రొయ్యల చెరువు కలుషిత నీటిని వదులుతున్న దృశ్యం

నామమాత్రంగా సంరక్షణ కేంద్రాలు

తీరంలో ప్రభుత్వం నామమాత్రంగా తాబేళ్ల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల వద్ద ఇద్దరు మత్స్యకారులను నియమించింది. వీరు ఉదయాన్నే తీరం వెంబడి తాబేళ్ల గుడ్లను గుర్తించి వాటిని తీసుకుని వెళ్లి ఈ సంరక్షణ కేంద్రాల్లో ఇసుకలో భద్రపరుస్తారు. తరువాత అవి పిల్లలైన తరువాత వాటిని సురక్షితంగా సముద్రంలోకి వదులుతారు. ఈ సంవత్సరం పాకల పోతయ్యగారి పట్టపుపాలెంలో ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రంలో సుమారు 500 గుడ్లను కాపాడి సంరక్షించారని మత్స్యకారులు తెలిపారు.



ఆలివ్ రిడ్ల సంరక్షణ కేంద్రం

సూపర్-6ను తుంగలో తొక్కారు

- వెలుగొండకు నిధులెక్కడ ?
- మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: సూపర్ 6 పథకాలను కూటమి సర్కారు గంగలో కలిపిందని మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ఓ అంకెల గారడీ అని అన్నారు. చంద్రబాబు సర్కారు మరోసారి తన మోసపూరిత నైజాన్ని చాటుకుందని విమర్శించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలుచేస్తామని చెబుతూనే బడ్జెట్‌లో కేటాయింపులు మాత్రం అరకొరగా చేశారని అన్నారు. ఈ రెండు పథకాల్లో భారీగా లబ్ధిదారులను తగ్గించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు ప్రతినెలా రూ.15 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని, దీనికి బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు, డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకూ వడ్డీలేని రుణాలు ఇస్తామని ప్రగల్బాలు పలికిన చంద్రబాబు బడ్జెట్‌లో ఒక్కరూపాయి కూడా కేటాయించలేదని, దీనితో లక్షలాది మంది మహిళలను చంద్రబాబు ఎప్పటిలాగే మోసం చేశారన్నారు. గత ఎన్నికల సమయంలో అప్పటి సీఎం జగన్‌కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తామని నమ్మించి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు చివరికి మానిఫెస్టోలో పెట్టిన హామీలనే అమలుచేయలేని దుస్థితికి వచ్చారన్నారు. బాబు షూరిటీ, మోసం గ్యారంటీ అని ఈ బడ్జెట్‌తో మరోసారి రుజువైందని జంకె చెప్పారు. వెలుగొండ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని, గత బడ్జెట్‌లో రూ.399 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రూ.359 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. కేవలం నిర్వాసితులను తరలించేందుకే రూ.800 కోట్లు ఖర్చవుతుందని, ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.2 వేల కోట్లు అవసరమని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మంత్రులు, ప్రాజెక్టులను సందర్శించి, సమీక్షలు జరిపి కేవలం బడ్జెట్‌లో నామమాత్రంగా కేటాయించారన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రాజెక్టు పనులు ఏవిధంగా పూర్తవుతాయని జంకె ప్రశ్నించారు.



జంకె వెంకటరెడ్డి

రైతాంగం ఆశలపై నీళ్లు చల్లిన రాష్ట్ర బడ్జెట్

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025–26 బడ్జెట్ జిల్లా రైతాంగం ఆశలపై నీళ్లు చల్లిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జజ్జురి జయంతి బాబు, పమిడి వెంకటరావు విమర్శించారు. స్థానిక ఎల్బీజీ భవనంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.1000 కోట్లు, మొదటి టన్నెల్ అడ్డంకులను తొలగించడానికి రెండో టన్నెల్ పనులను కొనసాగించడానికి మరో రూ.1000 కోట్లు అవసరమవుతాయని చెప్పారు. వెంటనే రూ.2 వేల కోట్లు కేటాయించి యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టి జూన్ నాటికి వరద నీటిని నల్లమల సాగర్‌కు నీటిని మళ్లించాలని రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఇప్పటికే 30 ఏళ్లుగా ప్రజలు వెలుగొండ ప్రాజెక్టు కోసం ఎదురు చూస్తున్నారని, అంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాజక్టుకు కేవలం రూ.359 కోట్లు మాత్రమే కేటాయించడం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం అన్నారు. పాలేటిపల్లి రిజర్వాయర్, సంగమేశ్వరం ప్రాజెక్టులను అస్సలు పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. గుండ్లకమ్మకు రూ.100 కోట్లు కేటాయిస్తేనే కానీ కాలువలకు నీరు ప్రవహించదన్నారు. బడ్జెట్లో సవరణ చేసైనాసరే ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

పిల్లల హక్కులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

ఒంగోలు సిటీ: పిల్లల హక్కుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రైవేటు స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకుంటామని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఒంగోలులో పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కనీస వసతులు కూడా లేవన్నారు. స్కూల్ ఫీజు చెల్లించని విద్యార్థులను క్లాస్ రూమ్ లో అందరి ముందు నిలబెడుతున్నారని, పిల్లల్ని ఫీజుల విషయంలో ఇబ్బంది పెడుతున్నారని దీనివల్ల పిల్లలు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. పరీక్ష సమయంలో పిల్లల చదువుపట్ల సరైన దృష్టి పెట్టలేకపోతున్నారన్నారు. విద్యార్థులకు కనీస సమాచారం అందించేలాగా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్స్ స్కూల్లో ప్రదర్శించాలని స్కూల్ యాజమాన్యాన్ని ఆదేశించారు. పిల్లలు ఫీజులు కట్టలేదని వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోజులో ఎక్కువ సమయం స్టడీ అవర్స్ పెట్టడం వలన వారు మానసిక ఒత్తిడికి గురవుతారని, పిల్లలకి కనీస సమయంలోనే చదువు నేర్పించాలన్నారు. క్లాస్ రూమ్స్ కి సరైన వెంటిలేషన్, పరిశుభ్రమైన టాయిలెట్స్ ఉండాలని, స్కూలు వదిలిన తర్వాత పిల్లలని జాగ్రత్తగా తల్లిదండ్రులకు అప్పగించాల్సిన బాధ్యత స్కూల్ యాజమాన్యంపై ఉందన్నారు. స్కూల్లో కనీసం ఉండాల్సిన కంప్లైంట్ బాక్స్, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్స్ ప్రదర్శించలేదని, కనీసం పాటించవలసిన నియమాల పట్ల ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తే ఆ స్కూల్ కి వెంటనే నోటీసులు జారీ చేయాల్సిందిగా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో మండల విద్యాశాఖ అధికారి, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు ఈ.నీలిమ వంశీ లత, బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

బడ్జెట్లో వెలుగొండకు అరకొర నిధులు అన్యాయం

- నిరసన ప్రదర్శనలో సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025–26 బడ్జెట్లో జిల్లాకు తలమానికం లాంటి వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి అరకొర నిధులు కేటాయించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చీకటి శ్రీనివాసరావు చెప్పారు. నగరంలోని సాగర్ సెంటర్లో శనివారం బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టుకు నామమాత్రంగా కేవలం రూ.359 కోట్ల నిధులు కేటాయించడం అంటే జిల్లా ప్రజలను అవమానపరచడమేనని స్పష్టం చేశారు. బడ్జెట్‌ను సవరించి కనీసం రూ.2 వేల కోట్లు కేటాయిస్తేనే కానీ 2026 నాటికి ప్రాజెక్టు నుంచి నీరు ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు. ప్రాజెక్టుకు నిధులు కేటాయించడాన్ని బట్టి చూస్తే ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ఉద్దేశం కనిపించడం లేదన్నారు. కూటమి సర్కార్ తీరును ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఆంధ్రకేసరి యూనివర్శిటీకి కానీ, విమానాశ్రయానికి, నగరాభివృద్ధికి, హార్బరు అభివృద్ధికి నయాపైసా కూడా వెచ్చించలేదని విమర్శించారు. జిల్లాకు నిధులు తీసుకొరావడంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు వైఫల్యం చెందారన్నారు. కూటమి తరపున గెలిచిన ఆరుగురు ఎమ్మెల్యేలు ఇప్పటికైనా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొనిరావాలన్నారు. గత ప్రభుత్వం 25 వేల మంది పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో సవరణలు చేసేంత వరకు ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.ఆదిలక్ష్మి, జి.రమేష్, ఎస్డీ హుసేన్, మాలకొండయ్య హనుమంతరావు, సుబ్బారావు, సుబ్బారెడ్డి, కేఎఫ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



దీవించమ్మా...



టైం అయిపోతోంది..

విజయీభవ

- పేర్నమిట్టలోని సరస్వతి కాలేజీలో విద్యార్థి మాల్ ప్రాక్టీస్
- తొలిరోజు 1408 మంది గైర్హాజరు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అధికారులు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసి పకడ్బందీగా నిర్వహించారు. మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్ వన్ పరీక్ష నిర్వహించారు. జనరల్, ఒకేషనల్ పరీక్షలకు కలిపి మొత్తం 22,690 మందికి గాను 21,282 మంది హాజరయ్యారు. 1408 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ పరీక్షకు 20,564 మంది విద్యార్థులకుగాను 19,461 మంది హాజరవగా, 1103 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకుగాను 2126 మందికి గాను 1821 మంది విద్యార్థులు హాజరవగా 305 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఓలు ఏడుగురు, 12 మంది డీఈసీ- డీఐఈఓలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 32 మంది స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఇంటర్ పరీక్షలను కలెక్టర్ తమీమ్ అన్సారియా సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఒంగోలులోని ఏకేవీకే జూనియర్ కాలేజీ, నారాయణ కాలేజీని ని పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీఓ ఉన్నారు. పేర్నమిట్ట సరస్వతి జూనియర్ కాలేజీలో పరీక్ష రాస్తుండగా ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్ చేస్తూ ఉన్నాడని గుర్తించి అతని మీద కేసు బుక్ చేశారు.



ఒంగోలులోని ఏకేవీకే పరీక్ష కేంద్రంలో తమ గది ఎక్కడో చూసుకుంటున్న విద్యార్థులు



- నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు
- ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో ప్రారంభమైన రంజాన్ మాసం
- ఉపవాస దీక్షలకు సరంజామా సిద్ధం చేసుకుంటున్న ముస్లింలు
- ముస్తాబైన మసీదులు
- సహరీ కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- అమ్మకాలకు సిద్ధమవుతున్న హలీం

ఉపవాసం... పుణ్యఫలం



నియ్యత్‌కి దువా

రోజికి నియ్యత్: అల్లాహుమ్మా అసూముగదన్ లక ఫగ్ ఫిర్లీ మాఖద్దమ్‌తు వమా అఖ్ఖర్తు.. ఉదయం సహార్ (ఉపవాసం ప్రారంభించే టప్పుడు) చేసే సమయంలో చేసే దువా..

ఇఫ్తార్‌కి దువా: అల్లాహుమ్మ లక సుమ్తు వఖిక ఆమన్‌తు వఅలైక తవక్కల్తు అలారిజ్ ఖిక అఫ్తర్తు ఫత ఖిబ్బల్ మిన్నీ.. సాయంత్రం ఇఫ్తార్ (ఉపవాస దీక్ష విరమించే) సమయంలో చేసే దువా..

కనిగిరి రూరల్/కంభం: ముస్లింల పవిత్ర మాసం రంజాన్ నెల ప్రారంభమైంది. శనివారం రాత్రి నెల వంక దర్శనమివ్వడంతో ఆదివారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమవుతున్నట్లు మసీదుల్లోని మత పెద్దలు ప్రకటించారు. రంజాన్ నెల ప్రారంభ సూచికగా కొన్ని ప్రాంతాల్లో సైరన్ మోగించారు. శనివారం రాత్రి 9 గంటలకు మసీదుల్లో ప్రత్యేక నమాజ్ (తరావీహ్) చదివారు. ముస్లింలు ఒకరికొకరు 'చాంద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉపవాసాలకు ముస్లింలు సరంజామా సిద్ధం చేసుకున్నారు. ముస్లింలు అత్యధికంగా నివసించే ప్రాంతాల్లో రంజాన్ మాస సందడి ప్రారంభమైంది. 'రంజాన్ నెలలో స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయి.. సైతాన్ బంధితుడు అవుతాడు'.. అనే మొహమ్మద్ ప్రవక్త ప్రవచనానికి అనుగుణంగా ముస్లింలు ఆధ్యాత్మిక జీవనాన్ని అలవరచుకుంటారు. ఆదివారం ఉదయం 5–08 గంటలకు సహార్ (ఉపవాస దీక్ష ప్రారంభం), సాయంత్రం 6.25 గంటలకు ఇఫ్తార్ (ఉపవాస దీక్ష విరమించడం) జరుగుతుంది.

రంజాన్ అనేది ఒక మాసం (నెల) పేరు. ఉర్దూలో రంజ్ అనగా దహించేదని, ఆన్ అంటే నెల అని అర్థం. మనషుల పాపాలన్నీ ఉపవాసాలతో, దానాలతో దహిస్తాయి. అందువలన రంజాన్ అనే పేరు వచ్చింది. ఈ మాసంలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ ఆవిర్భవించింది. రంజాన్ నెలలో ఖురాన్ చదివితే మరింత పుణ్యం లభిస్తుందని మత పెద్దలు చెబుతారు. ముస్లింలకు అత్యంత ముఖ్యమైన మాసం రంజాన్. ఈ నెలలో ముస్లింలు ఎంతో కఠోరమైన ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. రంజాన్ మాసంలో ముస్లింలలో భక్తిభావం ఉప్పొంగుతుంది. ధార్మిక చింతన, ప్రేమ, సౌభ్రాతృత్వం, దానగుణం, క్రమశిక్షణ, పరోపకారం తదితర నియమాలను ముస్లింలు పాటిస్తారు. రంజాన్ నెలలో అత్యంత నిష్టగా జరుపుకునే రోజు షబ్–ఏ–ఖదర్. దీని తర్వాత మూడు రోజులకు రంజాన్ పండుగ చేస్తారు. ఆదివారం నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుంది.

జిల్లాలో సుమారు 270 మసీదులు...

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అత్యధికంగా ముస్లిం జనాభా ఒంగోలు, కనిగిరి, కందుకూరు, పొదిలి, మార్కాపురం, కంభం, గిద్దలూరు, పర్చూరు ప్రాంతాల్లో ఉంది. ప్రస్తుతం జిల్లాలోని మున్సిపాలిటీల్లో అత్యధికంగా కనిగిరిలో ముస్లింలు ఎక్కువగా ఉన్నట్లు నివేదికలున్నాయి. జిల్లాలో సుమారు 270 వరకు మసీదులున్నట్లు సమాచారం. ఒక్క కనిగిరి నియోజకవర్గంలోనే 65 వరకు మసీదులున్నాయి. జిల్లాలోని మసీదులన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పలుచోట్ల రంజాన్ మాసం ప్రారంభ సూచికగా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా ముస్లింలు అధికంగా ఉండే ఏరియాల్లో తోరణాలు, ఫ్లెక్సీలతో కళకళ లాడుతున్నాయి.

30 రోజుల పాటు మసీద్ వద్ద సహారి ఏర్పాట్లు...

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఆచరించే వారి కోసం 30 రోజుల పాటు కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ (ఛోటి మసీద్)లో యువత సహారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం సహారి (ఉపవాసం ఆచరించే వారు ఉదయాన్నే తినే ఆహారం) మసీదులోనే ఏర్పాటు చేస్తున్నారు. దీనికి ముస్లిం యూత్ కమిటీలు టీంలుగా ఏర్పడి ఒక్కోరోజు కేటాయించుకున్నారు. వారికి కేటాయించిన తేదీల్లో ఉదయాన్నే రోజా ఆచరించే వారికి ఇఫ్తార్ సౌకర్యం కల్పిస్తారు. దీంతో రోజా ఆచరించే వారు మసీద్ వద్దకు వచ్చి సహారీ చేసుకుంటారు. దీన్ని ఎంతో సేవ, పుణ్యకార్యంగా భావిస్తారు.



కంభం పట్టణంలోని జమియా మసీదు

రోజా (ఉపవాస దీక్షలు)...

సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఎటువంటి ఆహార పానియాలు ముట్టకుండా (కఠోర దీక్ష) ఉపవాసాన్ని పాటిస్తారు. కనీసం లాలాజలం కూడా మింగరు. అత్యంత నిష్టతో ఉపవాసాన్ని (రోజాను) ఆచరిస్తారు. సూర్యోదయంకు ముందు సహార్ అని, సూర్యాస్తమయం తర్వాతా ఇఫ్తార్ అని పిలుస్తారు. రోజా ఉండేవారు సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత మాత్రమే ఏదైన ఫలాహారాలు తీసుకుంటారు. రోజుకు కనీసం 13 గంటలు ఉమ్మి కూడా మింగకుండా కఠోర దీక్షలు ఆచరిస్తారు. రోజా పాటించేవారు మనస్సును భగవంతునిపై లగ్నం చేసి చెడు ఆలోచనలకు దూరంగా ఉంటారు. సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని మసీదుల్లో, దైవ ధ్యానంలో గడుపుతారు. ఈ దీక్షల వల్ల మానవునిలో భగవంతుని పట్ల భక్తి, నమ్మకం, విశ్వాసం, భగవంతుని దృష్టిలో అందరూ సమానమే అనే భావం పెంపొందుతాయి.

కంభం పట్టణంలో...

కంభం పట్టణంలోని జామియా మసీదు, రైల్వేస్టేషన్ సమీపంలోని నూర్ మక్కా మసీదులో రంజాన్ నెల మొత్తం ఉపవాసదీక్షలు ఉండే వారి కోసం సహారీ ఏర్పాట్లు చేశారు. సహారీలో యువకులు ఉత్సాహంగా పాల్గొని మసీదుల్లో భోజనాలు తయారు చేసుకుని ఉపవాస దీక్షలు ఉంటారు. రైలు ప్రయాణానికి వెళ్లే వారు మసీదులో సహారీ చేసుకుని వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది.

ఏహ్ తే కాఫ్...

ఈ మాసంలో 21వ రోజు నుంచి నెల చివరి వరకు (తపోనిష్టతో) ఏహ్ తే కాఫ్ కూర్చుంటారు. ఈ ఏహ్ తే కాఫ్ పాటించే వారు మసీదులోనే పూర్తి సమయాన్ని గడపుతూ ప్రార్థనల్లో దివ్య ఖురాన్ (దైవ గ్రంథాలు) చదువుతూ ఉపవాస దీక్షల్లో నిమగ్నమవుతారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే మసీదు నుంచి బయటకు అడుగు పెడతారు.

జకాత్...

ముస్లింలలో మరో ముఖ్యమైన సంప్రదాయం జకాత్. ప్రతి వ్యక్తి తన లాభార్జనలో కొంత మేర నిరుపేదలకు దానధర్మాలు చేయడాన్ని జకాత్‌గా పిలుస్తారు. ప్రతి మనిషి తనలాగే ఉన్నతుడు కావాలని కోరుకోవడం ఈ జకాత్ ప్రధాన ఉద్దేశం. జకాత్ నిధితో నిరుపేదలకు వస్తువుల రూపంలోగానీ, నగదు రూపంలోగానీ దానం చేస్తారు. అయితే దానస్వీకర్తల పేర్లను గోప్యంగా ఉంచడమే దీని ప్రధాన నియమం. రంజాన్ నెలలోనే జకాత్ ఇస్తారు.

ఫిత్రా...

రంజాన్ మాసం చివరిరోజున జరుపుకునే పర్వదినం రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్). దేవుని అనుగ్రహం కోసం, కృతజ్ఞతగా నిరుపేదలకు ఫిత్రా (దానం) ఇస్తారు. ప్రతిఒక్కరూ కనీసం రెండు కిలోల గోధుమలు లేదా దానికి సమానమైన ఇతర ఆహార ధాన్యాలు లేదా నగదు దానం చేస్తారు. రంజాన్‌ను ప్రతి ముస్లిం లోటులేకుండా సంతోషంగా జరుపుకునేందుకు చేయాల్సిన దానధర్మాలను ఇస్లాం మతం ఉద్బోధిస్తుంది.

ఇఫ్తార్ ప్రత్యేకత...

రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసదీక్ష విరమింపజేసే కార్యక్రమాన్నే ఇఫ్తార్ అంటారు. ఇఫ్తార్ సమయంలో తీసుకునే ఆహారాన్ని దీక్ష వాసులకు అందించడం కూడా పుణ్యకార్యంగా భావిస్తారు. ఇఫ్తార్ విందులను ముస్లింలే కాకుండా ఇతరులు కూడా రోజా ఆచరించిన వారికి ఇస్తారు.

తరావీహ్ నమాజ్...

ముస్లింలు ప్రతిరోజూ 5 సార్లు నమాజు (ఉదయం ఫజర్, మధ్యాహ్నం జోహర్, సాయంత్రం 5 గంటలకు అసర్, రాత్రి 6.30 గంటలకు మగ్‌రీబ్, రాత్రి 8 గంటలకు ఇషా నమాజ్) చేస్తారు. అయితే, రంజాన్ నెలలో ఇషా నమాజ్ తర్వాత ప్రత్యేకంగా ఎంతో నిష్టతో మరో 20 రకాత్‌లు 'తరావీహ్' నమాజ్ చేస్తారు. రంజాన్ మాసంలో తరావీహ్ నమాజ్‌కు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది.

షబ్ ఏ ఖద్ర్...

రంజాన్ మాసంలో ఆచరించాల్సిన మరో అంశం షబ్ ఏ ఖద్ర్. ఆకాశ గ్రంథమైన దివ్యఖురాన్ రంజాన్ మాసంలో షబ్ ఏ ఖద్ర్ రోజున అవతరించింది. చివరి పదిరోజుల్లో 21, 23, 25, 27, 29వ బేసి రాత్రుల్లో ఏదో ఒక రాత్రి షబ్ ఏ ఖద్ర్ ఉంటుంది.

వరకట్న హత్య కేసులో నిందితుల అరెస్టు

మార్కాపురం: పట్టణంలోని కొండారెడ్డికాలనీలో గత నెల 26వ తేదీ గంజాయి లక్ష్మి అనే వివాహిత ఉరేసుకుని మృతిచెందిన కేసులో దర్యాప్తు చేసి వరకట్న హత్యకేసుగా మార్చి నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆ వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన దుద్దుకూరి దేవమ్మ కుమార్తె లక్ష్మికి మార్కాపురం పట్టణంలోని కొండారెడ్డి కాలనీకి చెందిన గంజాయి సాయితో 2022లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె ఉంది. పెళ్లి సమయంలో భర్తతో పాటు కుటుంబ సభ్యులకు రూ.3 లక్షలు కట్నంగా ఇచ్చారు. కొంత కాలం తర్వాత భర్త సాయిబాబు, మామ అల్లూరయ్య, అత్త సుశీలమ్మ, మరిది గంజాయి డాన్ కలిసి లక్ష్మిని అదనపు కట్నం కోసం వేధించినట్లు దేవమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో మరిది గంజాయి డాన్ గత నెల 26వ తేదీ లక్ష్మి తమ్ముడికి ఫోన్ చేసి మీ అక్క ఇంట్లో తాడుతో ఉరేసుకుందని సమాచారమిచ్చాడు. బంధువులు వచ్చి చూడగా మృతురాలి ఒంటిమీద గాయాలు, మెడమీద తాడుతో బిగించినట్లుగా ఉన్న గుర్తులు ఉన్నాయి. ఆ మేరకు తల్లి దేవమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. శనివారం పట్టణ ఎస్సై సైదుబాబు తన సిబ్బందితో కలిసి నిందితుని ఇంటివద్దకు వెళ్లగా వారు పారిపోయేందుకు ప్రయత్నించడంతో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించారు. అదనపు కట్నం కోసం మృతురాలిని శారీరకంగా, మానసికంగా వేధించి తాడుతో గొంతు బిగించి చంపినట్లు ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ సుబ్బారావు, ఎస్సైలు

గుడిలో, ఇంట్లో చోరీ

- సుమారు 10 సవర్ల బంగారం, రూ.1.80 లక్షల నగదు అపహరణ

సింగరాయకొండ: ఒకేరోజు గుడిలో, ఇంట్లో జరిగిన వేర్వేరు చోరీల్లో సుమారు 10 సవర్ల బంగారం, రూ.1.80 లక్షల నగదు అపహరణకు గురైంది. శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. సింగరాయకొండ మండల కేంద్రంలోని మినీబైపాస్‌లో అరుణకాలనీ మొదటిలైనులో నివసిస్తున్న మలినేని ఇందిర జాతీయ రహదారిపై విమానాల రన్‌వే వద్ద హోటల్ నిర్వహిస్తోంది. శుక్రవారం రాత్రి హోటల్ వద్దే ఉండి శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. ఇంటి తలుపులు తీసి ఉండటాన్ని గమనించి చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. మూడు సవర్ల బంగారం, రూ.1.80 లక్షల నగదు చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో ఘటనకు సంబంధించి.. మూలగుంటపాడు పంచాయతీ కార్యాలయం సమీపంలోని తిరుపతమ్మ గుడిలో చోరీ జరిగింది. ఆలయంలో 15 రోజుల క్రితం అమ్మవారి నూతన విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. శనివారం 16 రోజుల పండుగ నిర్వహించాల్సి ఉంది. అందుకోసం అమ్మవారి విగ్రహానికి సుమారు 7 సవర్ల బంగారం వస్తువులైన మంగళసూత్రం, చెవి కమ్మలు, బొట్టు, ముక్కుపుడక అలాగే ఉంచారు. రాత్రి సుమారు ఒంటిగంట వరకు పూజలు కూడా జరిగాయి. తెల్లవారుజామున 3 నుంచి 4 గంటల మధ్య చోరీ జరిగింది. ఆలయంలో హుండీ కూడా తొలగించారని, కానీ, హుండీలో కేవలం రూ.300లోపే నగదు ఉంటుందని, విలువైన బంగారం చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ రెండు చోరీలకు సంబంధించి క్లూస్ టీం సిబ్బంది వచ్చి ఆధారాలు సేకరించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై బి.మహీంద్ర తెలిపారు.



మలినేని ఇందిర ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

- విద్యార్థులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులతో శనివారం స్థానిక ప్రకాశం భవనం నుంచి జూమ్ మీటింగ్ నిర్వహించి కలెక్టర్ మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న తీరుపై ఆరా తీశారు. పలువురు విద్యార్థులతో నేరుగా మాట్లాడి భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి పదో తరగతి పరీక్షలు పాస్‌పోర్టు లాంటివని వ్యాఖ్యానించారు. పదో తరగతి విద్యార్థులకు ఆలిన్ వన్ గైడ్లు ఇచ్చామని, ట్యూటర్లను కూడా నియమించామని అన్నారు. వీటిని ఉపయోగించుకుని నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అందరూ కనీసం డిగ్రీ పూర్తి చేయాలని చెప్పారు. 18 ఏళ్లు నిండే వరకు పెళ్లి చేసుకోబోనని ప్రతి ఆడపిల్ల తీర్మానం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టాలని హాస్టల్ వార్డెన్లను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అంజల, పుల్లలచెరువు నుంచి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

కనిగిరి రూరల్: విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని పునుగోడులో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలో పెద్ద మనిషిలా వ్యవహరించే తోట చిన వెంకట నరసయ్య (69) మహాశివ రాత్రి సందర్భంగా గ్రామంలో అందరి సహకారంతో అభయాంజనేయస్వామి గుడి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలు ఇచ్చిన విరాళాల వివరాలతో కూడిన ఫ్లెక్సీని గుడి వద్ద ఏర్పాటు చేశారు. పండుగ ముగియడంతో ఆంజనేయస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఫ్రేమ్ తొలగించేందుకు తోట వెంకట నర్సయ్య, కల్లూరి కొండయ్య వెళ్లారు. ఫ్లెక్సీ ఐరన్ ఫ్రేం తొలగించే క్రమంలో బరువుకు అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మపై పడింది. దీంతో తోట వెంకట నర్సయ్య (69) కరెంట్ షాక్‌కు గురయ్యాడు. అతని కుడి కాలు, కుడి చేయి పూర్తిగా కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి కే కొండయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై టి.శ్రీరాం ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీరాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే వెంకట నర్సయ్య నిమిషాల వ్యవధిలో మృత్యుఒడికి చేరడంతో పల్లె జనం శోక సంద్రంలో మునిగిపోయారు. వెంకట నర్సయ్య భౌతిక కాయాన్ని వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



మృతుడు తోట వెంకట నర్సయ్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరాం

కోర్టు పనులను పరిశీలించిన హైకోర్టు జడ్జి

సింగరాయకొండ: స్థానిక మండల కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పనులను హైకోర్టు జడ్జి కె.మన్మథరావు శనివారం పరిశీలించారు. అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. మార్చి 15వ తేదీకల్లా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. అడ్వకేట్లు రాయి రమేష్, సన్నెబోయిన శ్రీనివాసులు, తహసీల్దార్ టి.రవి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.



కోర్టు పనులను పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి మన్మథరావు

జిల్లాలోని పోలీసుస్టేషన్లలో ఓపెన్ హౌస్

ఒంగోలు టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పోలీసు స్టేషన్లలో శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్లను సందర్శించిన మహిళలు, విద్యార్థినులకు పోలీసు స్టేషన్ల పనితీరు, మహిళా సహాయక కేంద్రంపై అవగాహన, పోలీసు స్టేషన్లలో ఉపయోగించే పరికరాలు, రికార్డుల నిర్వహణ, తదితర విషయాలను వివరించారు. మహిళా చట్టాలు, పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించారు. మానసికంగా, శారీరకంగా ధ్రుఢంగా ఉన్నప్పుడే స్వీయ రక్షణ సాధ్యమవుతుందన్నారు. బాలికలు చదవుకుని సమాజానికి, తల్లిదండ్రులకు ఉపయోగపడాలని సూచించారు. అత్యవసర సమయంలో సహాయం కోసం చైల్డ్ హెల్ప్ నంబర్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181, పోలీసు హెల్ప్ లైన్ 100, 112, సైబర్ క్రైం నంబర్ 1930, పోలీసు కంట్రోలు రూం నంబర్ 9121102266కు ఫోన్ చేయాలని పోలీసు అధికారులు సూచించారు.

పలకల గోడౌన్‌లో అగ్నిప్రమాదం

మార్కాపురం: పట్టణ శివార్లలోని ఎస్టేట్‌లో ఉన్న పలకల గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించి సుమారు రూ.2 లక్షల మేర ఆస్తినష్టం జరిగింది. ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్టేట్‌లోని చిలకపాటి లింగమయ్యకు చెందిన వేస్టేజీ ప్లాస్టిక్ గోడౌన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అందులో ఉన్న సామగ్రి కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం తెలియజేయడంతో ఫైరింజన్‌తో వచ్చి మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


సింగరాయకొండ: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి సుమారు 47 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం ఉదయం 11 గంటల సమయంలో సింగరాయకొండ–ఉలవపాడు రైల్వే స్టేషన్ల మధ్య మూడో రైల్వే లైనుపై జరిగింది. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, ఖాకీ రంగు ఫుల్ హాండ్స్ చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. ఒంటిపై పచ్చ, ఎరుపు, పసుపు గళ్ల కండువా కలిగి ఉన్నాడు. ఇతని ఆచూకీ తెలిసిన వారు ఒంగోలు జీఆర్‌పీ రైల్వేస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై టి.అరుణకుమారి సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించినట్లు తెలిపారు.



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

కారు ఢీకొని వ్యక్తి మృతి

మార్కాపురం: రోడ్డు పక్కన నడిచివెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొని మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం గ్రామ సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన ఎర్రయ్య నడుచుకుంటూ వెళ్తుండగా కంభం నుంచి మార్కాపురం వైపునకు వెళ్తున్న కారు ఢీకొని వేగంగా వెళ్లిపోయింది. దీంతో ఎర్రయ్య (45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ మేరకు అతని కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చారు. రూరల్ ఎస్సై అంకమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన ఎర్రయ్య